తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు శుభాకాంక్షల వెల్లువ



శుభాకాంక్షలు తెలుపుతున్న బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ తదితరులు

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, నార్సింగి మున్సిపాలిటీ చైర్మన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్‌లు వికారాబాద్‌లోని గడ్డం ప్రసాద్‌కుమార్ నివాసానికి చేరుకుని పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భవిష్యత్తుల్లో మరిన్ని ఉన్నత పదవులు దక్కించుకుని ప్రజాసేవ చేయాలని ఆకాంక్షించారు. ఏ–బ్లాక్ అధ్యక్షుడు డప్పు నవీన్‌కుమార్, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మణికొండ: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ నాయకులు, నార్సింగి మున్సిపాలిటీ కౌన్సిలర్లు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం బొర్ర జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నాయకులు ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కోకాపేట్ కౌన్సిలర్ శివారెడ్డి, నాయకులు శ్రీనివాస్, గోపాల గణేష్, రాజు తదితరులున్నారు.

రాజేంద్రనగర్: రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ జన్మదినం సందర్భంగా రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన దళిత సంఘాల నాయకులు మంగళవారం ఉదయం గడ్డం ప్రసాద్‌ను కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. దళిత సంఘాల సభ్యులు రగడంపల్లి శ్రావణ్, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా ఓట్ల లెక్కింపు

రాజేంద్రనగర్: చేవెళ్ల పార్లమెంటు ఓట్ల లెక్కింపులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు ఉత్కంఠభరితంగా సాగింది. 20 రౌండ్లలో ఓట్ల లెక్కింపు కొనసాగింది. మొదటి రౌండ్ నుంచే బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డిపై ఆధిక్యాన్ని ప్రదర్శించారు.

తొలిరౌండ్ నుంచి..

మొదటి రౌండ్ నుంచి ఆరు రౌండ్ల వరకు బీజేపీ ఆధిక్యం ప్రదర్శించింది. ఏడో రౌండ్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి స్వల్ప మెజార్టీ సాధించారు. అనంతరం 8,9 రౌండ్లలో బీజేపీ అభ్యర్థి అత్యధిక మెజార్టీ సాధించి నియోజకవర్గంలో ఆధిక్యం ప్రదర్శించారు. 10,11,12,14,15 రౌండ్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మెజార్టీ సాధించారు. మిగిలిన అన్ని రౌండ్లలో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించింది.

- బీజేపీ పార్టీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి 1,57,701 ఓట్లు రాగా.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రంజిత్‌రెడ్డికి 1,38,495 ఓట్లు వచ్చాయి. నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి 19,206 ఓట్ల ఆధిక్యాన్ని సాధించారు.

ప్రభావం చూపని బీఆర్‌ఎస్..

రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలో బీఆర్‌ఎస్ పార్టీ ఏ రౌండ్‌లో ఆధిక్యం ప్రదర్శించలేదు. మొదటి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు మూడో స్థానానికే పరిమితమయ్యారు. 19వ రౌండ్‌లో 3,733 ఓట్లు సాధించారు. ఈ ఓట్లే అన్ని రౌండ్లలో అత్యధిక ఓట్లుగా ఉన్నాయి. ప్రతి రౌండ్‌లో 695–2,354 ఓట్ల వరకు సాధించారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నప్పటికీ... ప్రభావం చూపలేకపోయారు.

సంబరాల్లో బీజేపీ నేతలు..

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో పార్టీ భారీ మెజార్టీ సాధించడంపై బీజేపీ నేతలు సంబరాలు చేసుకున్నారు. గత ఎన్నికల్లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయినప్పటికీ.. 19 వేలకు పైగా మెజార్టీ సాధించడం పట్ల సంబరాలు చేసుకున్నారు. బాణసంచా కాలుస్తూ.. ఒకరికొకరు స్వీట్లు తినిపించుకుంటూ విజయోత్సవాలు నిర్వహించారు.

టీవీలకు అతుక్కుపోయిన ప్రజలు..

రాజేంద్రనగర్: పార్లమెంటు ఎన్నికల ఫలితాల నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ ప్రజలు మంగళవారం ఉదయం నుంచే టీవీలకు అతుక్కుపోయారు. ఉదయం 8 గంటలకే పార్టీ కార్యాలయాలతో పాటు ఇళ్లల్లో టీవీలు చూస్తూ కనిపించారు. జాతీయ రాజకీయాలతో పాటు ఆంధ్రప్రదేశ్ ఫలితాలపై ఆసక్తి చూపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య హోరాహోరీ ఉండటంతో ఎక్కువ ఆసక్తి చూపించారు. బీఆర్‌ఎస్ ఆశించిన స్థాయిలో ఓట్లు రాబట్టుకోలేకపోయింది.

‘ఎస్కీ’లో జీఐఎస్‌పై స్వల్పకాలిక సర్టిఫికేషన్ కోర్సులు

- జూన్ 10 నుంచి నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ఎస్కీ డైరెక్టర్ డా.రామేశ్వరరావు

రాయదుర్గం: ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లో జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్(జీఐఎస్)లో స్వల్పకాలిక కోర్సులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించినట్లు ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు మంగళవారం వివరించారు. జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో 6వారాల, 4 వారాల వ్యవధితో ఉండే రెండు ప్రత్యేక సర్టిఫికేషన్ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కోర్సులను జూన్10వ తేదీ నుంచి నిర్వహించాలని తలపెట్టినట్లు పేర్కొన్నారు.అన్ని రకాల డేటాను మ్యాప్ చేసే ఏకైక వ్యవస్థ జీఐఎస్ కాబట్టి మెరుగైన కమ్యూనికేషన్ విధానంతో కూడిన సిలబస్ రూపొందించడం జరిగిందన్నారు.ఈ కోర్సులో చేరాలనుకునేవారు ఎల్‌సీఈ/ఎల్‌ఎంఈతో పాటుగా బీఈ, బీటెక్/ప్లానింగ్ లేదా ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ అర్హత, ఎంటెక్ టౌన్‌ప్లానింగ్, రిమోట్ సెన్సింగ్ జియోమ్యాటిక్స్, ఎన్విరాన్‌మెంట్ కలిగిన అభ్యర్థులు బీఎస్సీ కంప్యూటర్‌సైన్స్, కంప్యూటర్స్, ఎంఎస్సీ జీఓఇన్ఫర్‌మ్యాటిక్స్ కలిగిన అభ్యర్థులకు జీఐఎస్ సర్టిఫికేషన్ కోర్సు చేయడానికి అర్హతగా నిర్ణయించినట్లు ఆయన వివరించారు.

ఘనంగా ప్రపంచ సైకిల్ దినోత్సవం



ఎజైకిల్ ఆధ్వర్యంలో సైకిల్ దినోత్సవ ర్యాలీ

అబిడ్స్: ఎజైకిల్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ సైకిల్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆహ్లాదం, ఆరోగ్య ప్రయోజనాలను పెంపొందించేందుకు సైకిల్ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యం, సుస్థిరత, మనిషి సంతోషంగా ఉండేందుకు సైకిలింగ్ ఎంతో ప్రయోజనం అని అవగాహన కల్పించారు. మిస్టర్ వరల్డ్ సిల్వర్ మెడలిస్ట్ మీర్ మోతేషామ్, ఎజైకిల్ సీఈఓ శ్రీనివాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని సైకిల్ ర్యాలీ చేపట్టారు. సైకిల్ వల్ల ప్రయోజనాలను వివరించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న ఇన్‌స్పెక్టర్ బాలస్వామి

గౌలిపురా: మంగళవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి గౌలిపురా డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. దీంతో వర్షపు నీరు ఎక్కడక్కడ నిలిచిపోయాయి. అదే విధంగా బీబీబజార్ చౌరస్తా, ప్రధాన రోడ్డులో మ్యాన్‌హోల్ పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయి బ్లాక్ అయ్యింది. దీంతో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఈ విషయాన్ని గుర్తించిన భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎ.బాలస్వామి ఆధ్వర్యంలో పోలీసులు వర్షపు నీరు సజావుగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

బీజేపీ విజయోత్సవ సంబరాలు

చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా భారీ మెజార్టీతో కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గెలుపొందడంతో మణికొండ, నార్సింగి, బండ్లగూడ మున్సిపాలిటీ కేంద్రాల్లో బీజేపీ నేతలు బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. స్థానిక ఎన్నికల్లోనూ సత్తా చాటుతామని ఆ పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు.

– రాజేంద్రనగర్ జోన్ బృందం



కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మిఠాయి తినిపిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి





ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకుంటున్న బీజేపీ కార్యకర్తలు



విజయోత్సవ సంబరాల్లో బీజేపీ నేతలు



బాణసంచా కాలుస్తూ..



ఆరెమైసమ్మ దేవాలయం వద్ద..

వ్యక్తి అదృశ్యం

అత్తాపూర్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి ఇంటి నుంచి బయటకెళ్లి తిరిగి రాలేదు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఏఎస్సై రషీద్ మియా తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌కు చెందిన సంతోష్‌కుమార్ భార్య భాగ్యమ్మ స్థానికంగా పనులు చేసుకుని నివసిస్తుంటారు. గతనెల 10న ఇంట్లో నుంచి రూ.5వేలు తీసుకుని ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, స్నేహితుల వద్ద వాకబు చేసిన ఆచూకీ లభించలేదు. దీంతో భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: భారతదేశంలో ఫ్యాషన్ పరిశ్రమ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ‘మనూ’ డిజైనింగ్ కోర్సుల ఇన్‌చార్జీ సమనా మూస్వి మంగళవారం తెలిపారు. ఈ నేపథ్యంలో మనూలో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సులను ప్రారంభించడం జరిగిందన్నారు. ‘మనూ’, సమనా కాలేజ్ ఆఫ్ డిజైన్ సహకారంతో నాలుగేళ్ళ (యూజీ కోర్సు) బీఎస్సీ, రెండు ఏళ్ళ డిప్లొమో కోర్సు, ఫ్యాషన్ డిజైనింగ్, ఇంటీరియర్ డిజైనింగ్‌లో ఒక ఏడాది కాలపరిమితితో కూడిన సర్టిఫికెట్ కోర్సును నిర్వహించడం జరుగుతోందన్నారు. 10ప్లస్ 2 లేదా తత్సమాన కోర్సులో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశానికి అర్హులన్నారు. ఇది కాకుండా ఉర్దూ యూనివర్శిటీ మోడల్ స్కూల్, పాలిటెక్నిక్, గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు ప్రత్యేక మినహాయింపు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌తో పాటు ప్రాస్పెక్టస్ యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. దరఖాస్తు సమర్పించడానికి చివరితేదీగా జూన్30గా నిర్ణయించామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 81065 28786లో సంప్రదించాలన్నారు.

సమ్మర్ క్యాంపులో ఖురాన్ పఠనం

గోల్కొండ: వేసవి సెలవులను పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని నాంపల్లి ఎమ్మెల్యే మహ్మద్ మాజీద్‌హుస్సేన్ అన్నారు. వేసవి సెలవుల్లో మెహిదీపట్నం చోటీ మసీదులో మసీదు నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో పిల్లలకు సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖురాన్ గ్రంథ పఠనంతో పాటు వివిధ విషయాలపై విద్యార్థులకు స్పెషల్ క్యాంప్ నిర్వహించారు. మంగళవారం క్యాంప్ ముగింపు సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఆధ్యాత్మికతతో పాటు సేవా కార్యక్రమాలను అలవర్చుకోవాలన్నారు.

ప్రపంచ స్థాయి ర్యాంకింగ్స్‌లో ‘హెచ్‌సీయూ’

హెచ్‌సీయూ వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: ప్రపంచ స్థాయి ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 801–850 ర్యాంక్‌లో స్థానం పొందింది. కాగా ‘సిటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ’ సూచికలో హెచ్‌సీయూకు ప్రపంచంలో 335వ స్థానం లభించడం విశేషం. ప్రపంచంలోని అగ్రశ్రేణి విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా పేరుపొందింది. ఉన్నత విద్యా సంస్థలలో ర్యాంకింగ్స్‌ను క్వాక్వారెల్లి సైమండ్స్(క్యూఎస్) యూనివర్శిటీ ర్యాంకింగ్స్‌ను ప్రతిఏటా ప్రకటిస్తుంటారు. దీనిలో భాగంగా 2025 ర్యాంకింగ్స్‌ను ప్రకటించారు. క్యూఎస్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లో గత ఏడాది కంటే మెరుగైన స్థానం రావడం సంతోషించదగ్గవిషయని హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. 2025 ఎడిషన్‌లో సిటేషన్స్ ఫర్ ఫ్యాకల్టీ సూచికలో 335 ర్యాంక్‌ను పొందిందని, 2024లో 372వ ర్యాంక్ సాధించిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.


గాజుల అంజయ్యకు సన్మానం



గాజుల అంజయ్యను సన్మానిస్తున్న రాకేష్ తివారీ తదితరులు

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలు జూలై 7న గోల్కొండ అమ్మవారి బోనాలతో ప్రారంభమవుతాయని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. మంగళవారం సాయంత్రం ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీకి నూతన చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎంపికైన గాజుల అంజయ్యను పలు దేవాలయాల కమిటీ ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సప్త మాతృకలకు సప్త బంగారు బోనం కార్యక్రమంలో భాగంగా ఏడు అమ్మవారి ఆలయాలకు బంగారు పాత్రలో బోనంతో పాటు పట్టు వస్త్రాలను సమర్పించనున్నా మన్నారు. ఈ సారి బంగారు బోనం పూజా కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ మాజీ చైర్మన్ రాకేష్ తివారితో పాటు టీపీసీసీ కార్యదర్శి కె.ఎస్.ఆనంద్‌రావు, ప్రతినిధులు మధుసూదన్ యాదవ్, హన్స్‌రాజ్, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు మృతి.. కేసు నమోదు



జంగమ్మెట్ ఆసుపత్రి ఎదుట నిరసనలో సీపీఎం నాయకులు

చాంద్రాయణగుట్ట: వైద్యుల నిర్లక్ష్యం కారణంగా అప్పుడే పుట్టిన శిశువు మృతి చెందిన ఘటన ఫలక్‌నుమా పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమ్మెట్ రవీంద్రనాయక్ నగర్ కాలనీకి చెందిన రాజు కుమార్తె పింకి (21)కు మొదటి గర్భం కావడంతో ప్రసవం కోసం పక్కనే ఉన్న జంగమ్మెట్ ప్రసూతీ ఆసుపత్రిలో సోమవారం ఉదయం చేర్పించారు. రాత్రి 8 గంటలకు ప్రసవం చేసిన వైద్యులు చాలా సేపటి వరకు శిశువుకు సంబంధించిన సమాచారం కుటుంబ సభ్యులకు వెల్లడించలేదు. సాధారణ ప్రసవంతో జన్మించిన మగ శిశువు ఆరోగ్యం బాగాలేదంటూ చివరకు ఆగమేఘాల మీద నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శిశువు మృతి చెందినట్లు అక్కడి వెల్లడించారు. వైద్యులు కాకుండా కింది స్థాయి నర్సులు ప్రసవం చేయడంతోనే ఈ ఘటన చోటు చేసుకుందని సీపీఎం నాయకులు ఆసుపత్రి ఎదుట మంగళవారం ఉదయం నిరసన చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

ఔటర్ ఎక్కిన ఆటో సీజ్



సీజ్ చేసిన ఆటోతో సీఐ హరికృష్ణారెడ్డి

మణికొండ : ఔటర్‌పై ద్విచక్ర, త్రిచక్ర వాహనాలకు అనుమతి లేకపోయినా నార్సింగి వద్ద ఎక్కి, పోలీస్ అకాడమీ వద్ద దిగడంతో పాటు ప్రజల ప్రాణాలకు హాని కలిగించేలా నడిపిన డ్రైవర్‌పై నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేశారు. నార్సింగి ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఔటర్‌రింగ్ రోడ్డుపైకి అనుమతి లేకున్నా ఆటో (టీఎస్ 08యూకే 4724)తో ఎక్కడంతో పాటు నిర్లక్ష్యం, అతివేగంగా దాన్ని నడిపిన నేనావత్ రాజేందర్‌పై టోల్‌గేట్ ఇన్‌చార్జి ఫిర్యాదు చేశారన్నారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసి ఆటోను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు.

బీజేపీ నేతల సంబురాలు

అత్తాపూర్ : చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా విశ్వేశ్వర్‌రెడ్డి విజయంతో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. అత్తాపూర్ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ సంగీతాగౌరీశంకర్ ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేసుకున్నారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి చేవెళ్ల పార్లమెంట్ స్థానం నుంచి అత్యధిక మెజార్టీతో విజయం సాధించడం మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారం చేయడం జరుగుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్, సత్యనారాయణ, స్టార్ చిన్న సరిత, విజయ్, వెంకట్‌రెడ్డి, జిత్తు సతీష్, గురుప్రీత్‌సింగ్, సోను తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన నిర్మాణాల కూల్చివేత

అత్తాపూర్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శిథిలావస్థకు చేరిన ఇళ్లను కూల్చివేసినట్లు రాజేంద్రనగర్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ కె. రవికుమార్ తెలిపారు. ఇటీవల బాబుల్‌రెడ్డినగర్‌లో గోడకూలిన ఘటనలో చిన్నారులు మృతిచెందిన విషయం విషాదకరమన్నారు. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలను స్వచ్ఛందంగా తొలగించుకుంటే ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉంటాయని సూచించారు. ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ.. జీహెచ్‌ఎంసీ అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

ఔటర్ రింగ్ రోడ్డుపై రోడ్డు ప్రమాదం

– ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో బోల్తాపడిన టాటాఏస్, దెబ్బతిన్న కారు

రాజేంద్రనగర్: హిమాయత్‌సాగర్ ఔటర్‌రింగ్ రోడ్డుపై రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వైపు వెళ్తున్న టాటాఏస్ ఆటోను వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఎంజీ హెక్టర్ కారు ఢీకొనడంతో టాటాఎస్ ఆటో పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కిషన్‌రెడ్డి గెలుపుతోనే సికింద్రాబాద్ అభివృద్ధి

అబిడ్స్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి గెలుపుతోనే సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ కొల్లూరి పవన్‌కుమార్ పేర్కొన్నారు. అన్నివర్గాల ప్రజలు ఆదరించి కిషన్‌రెడ్డిని గెలిపించడం ఎంతో అభినందనీయమన్నారు. మంగళవారం తన కార్యాలయం వద్ద కిషన్‌రెడ్డి గెలిచిన వెంటనే టపాకాయలు పేల్చి మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం కొల్లూరి పవన్‌కుమార్ మాట్లాడుతూ..కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కానుండడంతో దేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంటుందన్నారు. సికింద్రాబాద్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం, దేశ నలుమూలలా ఎన్డీఏను గెలిపించిన ప్రజలకు కొల్లూరి పవన్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రపంచంలోనే ఇండియా నెంబర్:1 స్థానానికి ఎదుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

కిషన్‌రెడ్డికి అభినందనలు



కిషన్‌రెడ్డికి అభినందనలు తెలిపిన బజ్జుగోప్ యాదవ్

అబిడ్స్: మరోసారి సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ ఎంపీగా విజయం సాధించిన కిషన్‌రెడ్డికి గోషామహల్ ప్రాంతానికి చెందిన బజ్జుగోప్ యాదవ్ అభినందనలు తెలిపారు. మంగళవారం కిషన్‌రెడ్డిని ఆయన కలిసి సత్కారం చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ..సికింద్రాబాద్ పార్లమెంట్‌ను అన్నిరంగాల్లో అభివృద్దికి మరింత కృషి చేస్తానన్నారు

ఈ చేతి పంపులు..అలంకార ప్రాయమే

- శిథిలావస్థకు చేరినా స్పందించని జలమండలి
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- మరమ్మతు చేయాలని స్థానికుల డిమాండ్

చార్మినార్: అధికారుల నిర్లక్ష్యం కారణంగా చేతిపంపులు శిథిలావస్థకు చేరుకున్నాయి. శాలిబండ, బేలా కాలనీ, రాంబక్షి బండ తదితర కాలనీల్లోని చేతి పంపులే ఇందుకు నిలువెత్తు సాక్షాలుగా నిలుస్తున్నాయి. ఇవి కాకుండా పాతబస్తీలోనూ ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్న పరిస్థితులు..దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ తరహాలోనే చేతిపంపులు శిథిలావస్థకు చేరుకుని అలంకారప్రాయంగా మారయని స్థానికులు వాపోతున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత జలమండలి అధికారులు నిద్రావస్థలో ఉన్నారని, ఏళ్ల తరబడి ఇటువైపు కన్నెత్తైనా చూడడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేమని ప్రశ్నిస్తే..భూగర్భ జలాలు అడుగంటాయని కుంటిసాకులు చెబుతున్నారని చెబుతున్నారు. వాస్తవానికి అధికార యంత్రాంగం మరమ్మతులను విస్మరించారని, ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి పాతబస్తీలోని బోరింగ్‌లకు వెంటనే మరమ్మతు చేయించాలని స్థానికులు కోరుతున్నారు. రానున్న పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని కుళాయిల్లో నీరు సరఫరా అయ్యేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఖర్మకాండలకూ అవస్థలే...

కుళాయిల ద్వారా సరఫరా అయ్యే అరకొర నీటితో అవస్థలు పడుతున్నామని పాతబస్తీలోని యాకుత్‌పురా, చార్మినార్, చాంద్రాయణగుట్ట, బహదూర్‌పురా తదితర నియోజకవర్గాల్లోని స్థానికులు వాపోతున్నారు. గతంలో ఏర్పాటు చేసిన బోర్ల మరమ్మతు పనులను పూర్తిగా మరిచిపోవడమే ఈ పరిస్థితికి కారణమని, చావులు, ఖర్మకాండలు, దిన కర్మలు తదితర కార్యక్రమాల సమయంలో గతంలో బోరింగ్‌లపై ఆధారపడేవారమని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇక పండుగలు, ఉత్సవాల సమయంలో సమస్య మరింత తీవ్రంగా ఉంటుందని వాపోతున్నారు.

లెక్కలు తెలియని జలమండలి..!

ఇప్పటికే బస్తీలో ఏర్పాటు చేసిన బోర్‌లలో ఎన్ని పని చేస్తున్నాయి..? ఎన్ని శిథిలావస్థకు చేరుకున్నాయి..? మరమ్మతులు చేయిస్తే..ఎన్ని బోరింగ్‌లు అందుబాటులోకి వస్తాయి..? అనే సమాచారం సంబంధిత జలమండలి అధికారులు, సిబ్బంది వద్ద ఉందో లేదో తెలియని పరిస్థితి. కాగా కొంత మంది జలమండలి మేనేజర్లు తమ వద్ద సరైనా సమాచారం అందుబాటులో లేదనే విషయాన్ని వారే ఒప్పుకుంటున్న పరిస్థితి. దీంతో అధికారుల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేసవి నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా వెంటనే పవర్ బోర్లు, చేతి పంపులు, వాటర్ ట్యాంకులను బాగు చేయించాలని పాతబస్తీ ప్రజలు కోరుతున్నారు.



శాలిబండలో నిరుపయోగంగా చేతి పంపు



బేలా కాలనీలో..



రాంబక్షిబండలో..

మరమ్మతులు చేయించాలి...



పాతబస్తీలో శిథిలావస్థకు చేరిన చేతిపంపులతో పాటు, కొత్తవాటిని ఏర్పాటు చేసి నీటి కొరతను నివారించాలి. నీటి సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందించాని అధికారులపై చర్యలు తీసుకోవాలి. రానున్న సీజన్‌లో అవసరాలను దృష్టిలో ఉంచుకుని చేతిపంపులకు మరమ్మతు చేయాలి.

–ప్యారసాని వెంకటేష్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్